క్లుప్తంగా

మండప ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహించే వినాయకచవితి ఉత్సవ నిర్వాహకులు మండపాల ఏర్పాటు కోసం తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ వేణు అన్నారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ వినాయకుల మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ఆయా వివరాలు తెలుపుతూ పోలీసులకు దరఖాస్తు చేసుకుంటే దానికి అనుగుణంగా అనుమతులు ఇవ్వనున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మరిన్ని పూర్తి వివరాల కోసం కానిస్టేబుళ్లు హాజీబాబా పీసీ సెల్:90106 58831, సత్యం పీసీ సెల్: 99512 60264ను సంప్రదించాలన్నారు.

డీఈఓకు సన్మానం



వనపర్తి టౌన్: నూతనంగా విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన నరహరిని బుధవారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం (టీఎస్సీఎస్టీయూఎస్) అధ్యక్షుడు ఎస్ రాంసింగ్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ శాలువ, బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి, వనపర్తిలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి రాష్ట్రంలో వనపర్తి ప్రథమంలో నిలిచేలా చొరువ చూపాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు..

కొత్తకోట: కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కొట్టం వంశీధర్‌రెడ్డిని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి సన్మానించారు. కొత్తకోట మండలంలో గల 30మంది టీబీ రోగులకు వంశీధర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ఒక సంవత్సరం పాటు పౌష్టికాహారం అందించారు. ఆయన సేవలు గుర్తించిన వైద్యాధికారులు ప్రధానమంత్రి టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండియా తరపున వంశీధర్‌రెడ్డిని కలెక్టర్, జెడ్పీచైర్మన్లు సన్మానించడం జరిగిందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిశంకర్ తెలిపారు.

క్రీడాకారులకు అభినందన



పెబ్బేరు రూరల్: మదనాపురం మండల కేంద్రంలో ఈ నెల 12న నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో బాలికల విభాగంలో శ్రీరంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ప్రథమ బహుమతి సాధించారు. బుధవారం క్రీడాకారులను హెచ్‌ఎం కురుమయ్య, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయిలో బహుమతి సాధించి మండలానికి, పాఠశాలకు గుర్తింపు తెచ్చారని, అదే విధంగా జోనల్, రాష్ట్ర స్థాయిలో పాల్గొని పాఠశాలకు పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా క్రీడాకారులను చక్కని నైపుణ్యతతో తీర్చిదిద్ది జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని సాధించడానికి కృషి చేసిన టీపీడీ నిరంజన్‌గౌడ్‌ను అభినందించారు.

ఆకర్ ఛాసుంబా వేడుకలు

అమరచింత: మహమ్మద్ ప్రవక్త అనారోగ్యం నుంచి కోలుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ముస్లింలు బుధవారం ఆకర్ ఛాసుంబా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మొహర్రం ముగిసిన నెల రోజుల తర్వాత చివరి బుధవారం ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని ముస్లిం మత పెద్దలు తెలిపారు. ముస్లింలు కుటుంబ సభ్యుల సమేతంగా కలిసి వన భోజనాలకు వెళ్లి సరదాగా గడుపుతూ దైవ ప్రార్థనలో లీనమయ్యారు. మండలంలోని జూరాల ప్రాజెక్టు, హజిమలంగ్ బాబా దర్గాతో పాటు రామన్‌పాడ్ రిజర్వాయర్‌కు తరలివెళ్లారు.

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

అమరచింత: ఇంటి ముంగిళ్లతో పాటు పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని బ్రీడింగ్ చెక్కర్ కృష్ణయ్య తెలిపారు. పట్టణంలోని ఐదో వార్డులో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్య సలహాలను అందించారు. ప్రతిరోజు కుళాయి ద్వారా వస్తున్న నీటిని వినియోగించుకోవాలని, నిల్వ నీటి వల్ల దోమలు పెరిగే అవకాశం ఉందని కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. కాలనీలోని మురుగుకాల్వల వెంట దోమల నివారణ కోసం మందులను పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తౌఫిక్, ఇమ్రాన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సైబర్ నేరాలతో అప్రమత్తం



వనపర్తిలో మాట్లాడుతున్న జి. ఉత్తరయ్య

వనపర్తి టౌన్: ప్రజలు సైబర్ నేరగాళ్లలతో అప్రమత్తంగా ఉండాలని లోక్ అదాలత్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో లోక్‌అదాలత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్ పిల్లలు వాహనాలు నడపకూడదని, నిర్దేశిత వయస్సు వచ్చాక లైసెన్స్ తీసుకొని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ట్రిబుల్ రైడింగ్ చేయడం చట్ట వ్యతిరేకమని, తద్వారా చట్టపరమైన చర్యలకు అర్హులవుతారని హెచ్చరించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని కోరారు. కార్యక్రమంలో సఖి సెంటర్ నిర్వాహకురాలు ఎం. కవిత, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు డేగల కృష్ణయ్య, న్యాయవాది నరేందర్‌బాబు, వసతి గృహాల అధికారులు జీఎస్ రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన

గోపాల్‌పేట: విద్యార్థులు సైబర్ నేరాలు, ఉమెన్ సేఫ్టీ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ ఎండీ అంజద్ అన్నారు. బుధవారం ఆయన జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితుల్లో 100 కు కాల్ చేయాలని చెప్పారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయడం, లింకులు పంపితే ఓపెన్ చేయడం వంటి చేయొద్దన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుని కళాశాలకు పంపిస్తారని, సమయం వృథా చేయకుండా వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు కష్టపడి చదవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్, సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో..

17న గరికపాటి భగవద్గీత సందేశం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఆత్మకూర్: నిత్య జీవితంలో భగవద్గీత అనే అంశంపై గరికపాటి నరసింహారావుతో సందేశ కార్యక్రమం పట్టణంలో ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈనెల 17న స్థానిక ఎంవీరామన్ పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి నృత్యాలు, అన్నమయ్య సంకీర్తనలు, భగవద్గీత శ్లోకాలు, ఆధ్యాత్మిక గీతాలాపన, సాయంత్రం నాలుగు గంటలకు గరికపాటి నిత్యజీవితంలో భగవద్గీత అనేఅంశంపై సందేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డితో పాటు శ్రీసంత్‌సదానందగిరి మహారాజ్, ఆచార్య శ్రీనివాస్ తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేర్వరాజు, తమ్మలి విజయ్, శివరాం, సూరి పాల్గొన్నారు.

ముగిసిన మద్దెలేశ్వరి మాత ఉత్సవాలు



అమరచింత: పద్మశాలీల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మద్దెలేశ్వరి మాత బోనాలు బుధవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు పట్టణంలో పద్మశాలీలు మద్దెలేశ్వరి దేవత ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజు స్థానిక భక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి అక్కడి నుంచి అమ్మవారి బోనాన్ని ఆలయానికి తీసుకొచ్చారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పోటేళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మహంకాళీ విష్ణు, దేవరకొండ లచ్చన్న, మహంకాళీ ప్రభాకర్, మోహన్, పాండు, ఎంకంపల్లి శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సహకరించండి

అమరచింత: మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు మున్సిపల్ అధికారులు సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీఓ భారతి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మహమ్మద్‌ఖాజాతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మున్సిపాలిటీలో సైతం వీటి నిర్వహణను ఆర్పీలకు అప్పగించాలని కోరారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ సీఐటీయూ నాయకులు అడ్డుకుంటున్నారని, రెండు రోజుల వ్యవధిలో అంగన్‌వాడీలను తెరిచి లబ్ధిదారులకు సరుకులను అందించేందుకు తమ వంతు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్మద తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న సీడీపీఓ భారతి

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చిన్నంబావి: బైక్, జీపు ఢీకొట్టిన ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలోకి వెళ్తే.. మండలకేంద్రానికి చెందిన ఆకునూరి మధు, మహేశ్వరి మండలంలోని పెద్దదగడ నుంచి స్వగ్రామానికి వస్తుండగా.. మార్గ మధ్యలో జీపుకు ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు బాధితుడిని పెబ్బేరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

డిగ్రీ కళాశాలలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి

అత్మకూర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సమస్యల పరిష్కారానికి పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం విద్యార్థులు ఆయనను కలిసి కళాశాల ఊరికి దూరంగా ఉండడంతో వివిధ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు విముఖత వ్యక్తం చేస్తున్నారని, సీట్లు ఖాళీలు ఏర్పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అభ్యర్థించారు. త్వరలోనే కళాశాలను సందర్శించి కావలసిన మౌలిక సదుపాయాలను సొంత నిధులతో సమకూర్చుతానని వర్కటం విద్యార్థులకు భరోసా ఇచ్చారు.



వర్కటం జగన్నాథ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

రైతులకు రుణాలు మంజూరు చేయాలి

వీపనగండ్ల: పంట రుణాలు మాఫీ అయిన రైతులకు తిరిగి కొత్త రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్ అధికారులు నిరాకరిస్తున్నారని, వెంటనే రైతులకు మళ్లీ రుణాలు మంజూరు చేయాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధికారులతో ఆయన మాట్లాడారు. ఐఓ బ్యాంక్‌లో దాదాపు 500 మంది రైతులకు రుణమాఫీ కాలేదని, ఈ విషయమై బ్యాంక్ అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గోపి, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువశక్తి ఫౌండేషన్ సేవలు వెలకట్టలేనివి



ఖిల్లాఘనపురం: రాష్ట్ర వ్యాప్తంగా ఆపదలో ఉన్నవారికి అత్యవసర సమయంలో రక్తదానం చేస్తున్న యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు, స్టేట్ డైరెక్టర్ గోబురు నవీన్, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, సభ్యులు సాయితేజ, శివను బుధవారం రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ డీఐజీ సుమతి ఐపీఎస్ సన్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా గర్భిణులు, డెంగీ, డయాలసిస్‌తో బాధపడుతున్న వారికి అత్యవసర సమయంలో రక్తదానం చేస్తున్న యువశక్తి ఫౌండేషన్ వారు బుధవారం హైదరాబాద్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు మధు తెలిపారు.

అభివృద్ధికి సహకరిస్తా

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చిన్నమందడిని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ బుధవారం సందర్శించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా తాను దత్తత తీసుకున్న గ్రామాన్ని సందర్శించి వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50శాతం లబ్ధిదారులు, 50శాతం సంస్థతో కలిపి మొత్తం 64సైకిళ్లను గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, సర్పంచ్ సూర్యచంద్రారెడ్డి గ్రామస్తులతో కలిసి గ్రామంలోని రోడ్ల వెంట సైకిళ్లను తొక్కారు. ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ సహకారంతో ఏర్పాటు చేసిన గోబర్ గ్యాస్ ట్యాంక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాగేంద్రయాదవ్, అశోక్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, వినోద్‌రెడ్డి, సంజీవన్‌రెడ్డి ఉన్నారు.



ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఆత్మకూర్: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్లు రాజు, షేక్‌చాంద్ పాష, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, మాస్టర్ ట్రైనర్ సాయినాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మదనాపురం, అమరచింత, ఆత్మకూర్, సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకోనున్న వారి వివరాలను సేకరించి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు.

బీజేపీతోనే సుపరిపాలన సాధ్యం

అత్మకూర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మోసపూరిత పాలన కొనసాగుతుందని, మక్తల్ నియోజకవర్గంలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన నిరుద్యోగుల కోసం ఒక్కరోజు ఉపవాస దీక్షల కార్యక్రమానికి ఆత్మకూర్ నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమని, ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని త్వరలోనే రానున్న ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, జిల్లా కార్యదర్శి అశోక్‌కుమార్‌జీ, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, గాడి శేషు, రఘుయాదవ్ తదితరులు ఉన్నారు.

అమరులను స్మరించుకోవడం బాధ్యత

ఖిల్లాఘనపురం: దేశ సేవలో భాగస్వాములై ప్రాణ త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, అమర సైనికులు, పోలీసులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని మామిడిమాడలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి, మాజీ సర్పంచ్ భద్రయ్య ఆధ్వర్యంలో 'మేరి మట్టి మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా అమృత కలశ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, అంజనేయులు, శివశంకర్, సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, దవమణి, శంకర్, నిరంజన్, తిరుపతయ్య, కేశన్న, ఈదమ్మ తదితరులు పాల్గొన్నారు.



మామిడిమాడలో కలశ యాత్ర నిర్వహిస్తున్న నాయకులు



వనపర్తి మండలంలో..

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని ఎద్దులగేరి, నాగమ్మతండా ఆలయం వద్ద పూజలు నిర్వహించి మేరా దేశ్ మేరీ మట్టి కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు ఎద్దుల దేవేందర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమంపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎద్దుల బీమేష్, కాశన్న, వేణు, జానీ, సురేష్‌కుమార్, పరమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రామయ్య

పాన్‌గల్: ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలకు దూరంగా ఉండొచ్చని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. దీంతో పాటు భోజనానికి ముందు తప్పక చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి సారించగలుగుతారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ ఆంజనేయులు, సూపర్‌వైజర్ సంతోషమ్మ, వైద్య సిబ్బంది సతీష్, ఆశా కార్యకర్తలు సరస్వతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా

గోపాల్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, దీంతో ప్రజలు ఎంతో ఆనందంతో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త ప్రమోద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొలికెపాడులో పర్యటించిన ఆయన బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత పొలికెపాడు నుంచి గోపాల్‌పేట మీదుగా వనపర్తి వెళ్లేందుకు ప్రత్యేక బస్సును ప్రారంభించి విద్యార్థులకు పాస్‌లు ఉచితంగా అందించారు. విద్యార్థులకు ఈ బస్సు సౌకర్యం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షుడు తిరుపతియాదవ్, పొలికెపాడు సర్పంచు రజిని, జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోదండం, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బస్సు ప్రారంభిస్తున్న ప్రమోద్‌రెడ్డి

తెలంగాణకే పాలమూరు పచ్చని మాగాణి

అమరచింత: పాలమూర్, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తెలంగాణకే పచ్చని మాగాణిగా మార్చేస్తుందని బీఆర్‌ఎస్‌వీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు అన్నారు. పట్టణంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేందర్‌సింగ్ ఇంట్లో మంగళవారం సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శతాబ్దపు అతిపెద్ద మానవ విజయం పాలమూర్ రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అని కొనియాడారు. మండలంలో రైతులు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు భారీగా తరలివచ్చి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, శ్రీలన్‌గౌడ్, నాగభూషణం గౌడ్, జయసింహారెడ్డి, జింక రవి, కమాలాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు ప్రతిరూపమే అంగన్‌వాడీలు

పెబ్బేరు రూరల్: గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లుగా పనిచేసే ప్రతి ఒక్కరూ అమ్మకు ప్రతి రూపం లాంటి వారని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు తూడి మేఘారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ టీచర్లు చేస్తున్న సమ్మె బుధవారం కాంగ్రెస్ జిల్లా కమిటీ తరపున మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మేఘారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటస్వామి, కౌన్సిలర్లు రాధాకృష్ణ, వెంకటేష్, బ్రహ్మంచారి, నాయకులు శంకర్‌నాయక్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, గోపాలకృష్ణ, రాములు, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షులు శారద, జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, కవిత, రాధ, రమాదేవి, సునీత, సుమతి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై పోలీసులకు ఫిర్యాదు

అమరచింత: హక్కుల సాధనలో భాగంగా ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలకు సమాచారం ఇవ్వకుండా మూసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి తాళాలను పగులగొడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్, అంగన్‌వాడీల సంఘం జిల్లా నాయకురాలు నాగేంద్రమ్మ మాట్లాడుతూ పోరాడే సంఘాలకు చర్చలకు పిలవకపోవటం అప్రజాస్వామికం అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధ, రేణుక లత, పరిమళ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో ఎస్‌ఐ జగన్మోహన్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ



శంకరమ్మ పేటలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

మదనాపురం: మండలంలోని శంకరమ్మపేటలో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనలో పేదలకు ఒరిగిందేమి లేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. గ్రామాల్లో నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్ కార్డులు, దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రూ. 500 కే సిలిండర్, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీల ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షలు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లెపాగు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన కేతూరి చిన్న ఈరయ్య అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు రూ.5 వేలు పంపారు. ఆ నగదును బుధవారం పార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కృష్ణ, మాజీ సర్పంచ్ చంద్రయ్య, సుధాకర్‌యాదవ్, స్వామి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడకు చెందిన నరేశ్ వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. బాధితుడిని బుధవారం బీఆర్‌ఎస్ నాయకుడు రంగినేని అభిలాష్‌రావు పరామర్శించారు. ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్‌ఓసీ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహిచంద్ర, కిరణ్‌గౌడ్, రమేష్ జింకల, గంగయ్య, బాలగౌడ్, సతీష్ పాల్గొన్నారు.